సాక్షి
తిరుపతి
సోమవారం। 23। జూన్। 2025





## ఎంటీఎస్ టీచర్లపై కుట్ర

చిత్తూరు డీఈఓ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంటీఎస్ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. - 8లో



## చంద్రగిరిలో రాక్షస పాలన

చంద్రగిరి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. - 8లో



## పోరు గాలి.. వేట ఖాళీ!

సముద్రంలో పోరు గాలి కారణంగా మత్స్య సంపద లభించడం లేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

**తిరుపతి అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అర్జీదారుల అవస్థలు**

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణుల సౌకర్యార్థం అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో వినతులు రాసుకునేందుకు పలువురు ఇబ్బంది పడుతున్నారు. అలాగే తిరుపతి నగరానికి కలెక్టరేట్ దూరంగా ఉన్న నేపథ్యంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గతంలో సెంట్రల్ బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నడిపేవారు. ఇప్పుడు వాటిని నిలిపివేయడంతో అర్జీదారులపై భారం పడుతోంది. దీనికితోడు వినతులు సమర్పించేందుకు ప్రజలు టోకెన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో పలువురు అటెండర్లు దురుసుగా ప్రవర్తిస్తుండడంతో అర్జీదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే సచివాయాలు, మండల, డివిజన్ కార్యాలయాల్లో సక్రమంగా గ్రీవెన్స్ నిర్వహించడం లేదు. దీంతో చిన్న చిన్న సమస్యలకు సైతం జనం వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోంది.

### టీటీడీ డీఎఫ్‌ఓగా ఫణికుమార్‌నాయుడు

**తిరుమల :** టీటీడీ డీఎఫ్‌ఓగా డీ.ఫణికుమార్ నాయుడు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి డీఎఫ్‌ఓ శ్రీనివాసులును ఎస్వీ గోశాల డైరెక్టర్‌గా నియమించడంతో ఆయన స్థానంలో డీ.ఫణికుమార్‌నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక టీటీడీ అటవీశాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. టీటీడీ అటవీ సంరక్షణ, భక్తుల రక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన డీఎఫ్‌ఓకు ఎస్‌ఆర్‌ఓ దొరైస్వామి, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 90,087 మంది స్వామివారిని దర్శించుకోగా 41,891 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# బార్‌లా తెరిచేశారు!



తిరుచానూరు రోడ్డులోని పద్మావతి వైన్స్ పక్కన అనధికార పర్మిట్ రూమ్



శివ వైన్స్ పక్కన గదిలో మందుబాబులను పరిశీలిస్తున్న భూమన

పవిత్ర తిరునగరంలో లిక్కర్ మాఫియా రెచ్చిపోతోంది. అక్రమార్జనే లక్ష్యంగా విచ్చలవిడి విక్రయాలకు పాల్పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా అనధికార పర్మిట్‌రూమ్‌లను నిర్వహిస్తోంది. వైన్‌షాపులకు అనుబంధంగా మందుబాబులకు సకల వసతులు సమకూరుస్తోంది. రాత్రింబవళ్లు మద్యం అమ్ముకునేందుకు అన్ని మార్గాలను బార్‌లా తెరిచేసింది. సుమారు మాసం క్రితం వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ చేపట్టిన తనిఖీల కారణంగా లిక్కర్ మాఫియా వెనుకంజ వేసింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో మళ్లీ ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలకు తెరతీసింది. ఆధ్యాత్మిక క్షేత్రంలో అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు ఏకంగా వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి రంగంలోకి దిగారు.. ఆదివారం ఆయన స్వయంగా నగరంలోని వైన్‌షాపులు..పక్కనే ఏర్పాటు చేసిన గదులను తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు.

**ఆధ్యాత్మిక క్షేత్రంలో మళ్లీ పడగవిప్పిన లిక్కర్ మాఫియా**

- ప్రతి మద్యం దుకాణం వద్ద అనధికార పర్మిట్ రూములు
- వైన్‌షాపులకు పక్కనే మందుబాబులకు ప్రత్యేక ఏర్పాట్లు
- బెల్టు దుకాణాలుగా కూల్‌డ్రింక్ షాపులు
- తిరుపతిలో ఎనీటైమ్ మద్యం అమ్మకాలు
- భూమన తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలు



తినుబండారాలను పరిశీలిస్తున్న భూమన

**సాక్షి ప్రతినిధి, తిరుపతి :** ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో కూటమి నేతల అండదండలతో మద్యం మాఫియా చెలరేగిపోతోంది. నగరంలోని ప్రతి మద్యం దుకాణం ఓ బారును తలపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా రేయింబవళ్లు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఎంఆర్‌పీ ధరల కంటే అదనంగా వసూలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆకస్మిక తనిఖీల్లో మద్యం మాఫియా విచ్చలవిడి అమ్మకాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు నెల క్రితం వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి నగరంలో విచ్చలవిడిగా పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్న విషయాలను వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతో కొద్ది రోజుల పాటు మద్యం దుకాణాల యజమానులు పర్మిట్ రూముల జోలికి వెళ్లకుండా నిబంధనల మేరకు నడిపారు. తర్వాత యథావిధిగా అమ్మకాలను ప్రారంభించారు. ఈ సారి భూమన కరుణాకర రెడ్డి స్వయంగా పరిశీలించి ఎక్సైజ్ కమిషనర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తుండంపై భూమన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని మద్యం బ్రాండ్లపై ఎంఆర్‌పీ కంటే రూ.30 నుంచి రూ.40 అదనంగా వసూలు చేయడాన్ని ప్రత్యక్షంగా చూసి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నగరంలో మద్యం మాఫియా ఎలా రెచ్చిపోతుందో చూద్దాం రండి..

- **సాయంత్రం 4.25 గంటలు :** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో శిల్పారామానికి ఎదురుగా పద్మావతి వైన్స్, ఆ పక్కనే ఉన్న ఈడెన్ పార్క్ వైన్స్ వెనుక భాగంలో తాటాకు, కొబ్బరి మట్టలతో బార్లను తలపించేలా ఏర్పాటు చేసి ఉన్న పర్మిట్ రూములను కరుణాకరరెడ్డి పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులను సైతం మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సెక్యూరిటీతో విజిల్ వేయించి పిలిపిస్తున్నారు. ఆ రెండు వైన్‌షాపుల వెనుక మందుబాబు కూర్చొని మద్యం తాగేందుకు వీలుగా దిమ్మెలు ఉండడం గమనించారు. ఈ క్రమంలో పలువురు మందుబాబు అక్కడ మద్యం తాగడం కనిపించింది.



రైల్వేస్టేషన్ పక్కన ఫైవ్‌స్టార్ వైన్స్ అనధికార గది

- **4.50 గంటలు :** టీవీఎస్ షోరూమ్ కూడలి వద్ద ఉన్న విక్టరీ వైన్స్ వెనుక భాగంలో బార్‌ని తలపించేలా ఏర్పాటు చేసిన పర్మిట్ రూముని భూమన పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న విషయంపై అధికారులకు ఫిర్యాదు చేశారు.

- **5.01 గంటలు :** రైల్వేస్టేషన్ పక్క సందులో ఏర్పాటు చేసి ఉన్న నైన్ స్టార్ వైన్స్ వద్దకు భూమన చేరుకున్నారు. వైన్ షాపు పరిధిలోనే రేకుల షెడ్డుతో పర్మిట్ రూము ఏర్పాటు చేసి వచ్చిపోయే జనాన్ని పిలిపించి కూర్చొబెట్టి మద్యం తాగించడం గమనించి మండిపడ్డారు.

- **5.12 గంటలు :** ఓల్డ్ మెటర్నటీ ఆస్పత్రి ఎడమ వైపు ఉన్న బడివైన్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేకంగా పర్మిట్ రూము ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. అక్కడే మిద్దెపైన ప్రత్యేకంగా బార్‌ని తలపించేలా రేకుల షెడ్డు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు.
- **5.19 గంటలు :** అన్నారావు కూడలి వద్ద ఏర్పాటు చేసిన జేకే వైన్స్ వారు కూడా పర్మిట్ రూము ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు.
- **సాయంత్రం 5.28 గంటలు :** జీవకోన వద్ద ఏర్పాటు చేసిన జీవా వైన్స్ ఎదురుగా, పక్కన బహిరంగ ప్రదేశంలో, మరో వైపు పర్మిట్ రూములో యథేచ్ఛగా మద్యం ప్రియులను కూర్చోబెట్టి తాగిస్తున్నారు.
- **5.38 గంటలు :** లీలామహల్ కూడలి నుంచి కరకంబాడికి వెళ్లే మార్గంలోని ఫ్లైఓవర్‌కి అనుకుని ఉన్న ఎస్‌వీఎస్ వైన్ షాపు యాజమాన్యం కూడా నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూము ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తుండడాన్ని భూమన గమనించారు.
- **5.49 గంటలు:** సామవాయి మార్గంలోని మామా వైన్స్ యాజమాన్యం కూడా పర్మిట్ రూము ఏర్పాటు చేసి బయట ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు కర్టెన్ ఏర్పాటు చేసి మందుబాబులు కూర్చుని తాగే వెసులుబాటు కల్పించారు.

- **5.56 గంటలు :** తిరుపతి నుంచి తిరుచానూరు వెళ్లే మార్గం పద్మావతిపురం వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసి ఉన్న శివ వైన్స్ యాజమాన్యం కూడా నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూము ఏర్పాటు చేయడం భూమన కరుణాకరరెడ్డి తనిఖీలో వెలుగులోకి వచ్చింది.



అపరిశుభ్ర తినుబండారాలను చూపుతున్న భూమన





పాత మెటర్నటీ ఆస్పత్రి వద్ద..



ఎక్కడ పడితే అక్కడే..





పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో..





తిరుచానూరు రోడ్డులోని వైన్‌షాపు



విక్టరీ వైన్స్ వద్ద భూమనను చూసి పరుగులు తీస్తున్న పచ్చ మీడియా రిపోర్టర్



అన్నమయ్య సర్కిల్ వద్ద పడిపోయిన మందుబాబు



కరకంబాడి రోడ్డులో..

# పచ్చనేతల భూమేత!



రేణిగుంట విమానాశ్రయం రహదారిలో ప్రభుత్వ భూమిని జేసీబీలతో చదును చేయిస్తున్న దృశ్యం

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు ఇష్టారాజ్యంగా కబ్జాలకు పాల్పడుతున్నారు. బినామీ పేర్లతో యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగానే రేణిగుంట మండలం కొత్తపాళెంలో రూ.60 కోట్ల విలువైన భూమిని కబళించేందుకు సన్నద్ధమయ్యారు. ఇందుకోసం పకడ్బందీగా కార్యాచరణ అమలు చేశారు. ఈ క్రమంలోనే ఆదివారం భారీ యంత్రాలతో రంగంలోకి దిగారు. అక్రమాలపై నిగ్గుతేల్చేందుకు వచ్చిన మీడియాపై వీరంగం చేశారు. రెవెన్యూ అధికారులు అడ్డుపడేసరికి చల్లగా జారుకున్నారు.

- రేణిగుంట ఎయిర్‌పోర్టు సమీపంలో రూ.60 కోట్ల భూమి కబ్జా
- భారీ యంత్రాలతో చదును చేసేందుకు యత్నం
- స్థానికుల ఆగ్రహంతో అడ్డుకున్న రెవెన్యూ యంత్రాంగం
- ఇదే కోవలో ఎర్రమరెడ్డిపాళెం చెరువులో టీడీపీ నేతల ఆక్రమణ
- ట్రెంచ్ తవ్వి అడ్డుపడిన రైతు సంఘం



కబ్జాకు గురైన స్థలం కాపాడేందుకు ట్రెంచ్ తవ్విస్తున్న రైతు సంఘం నేతలు

**రేణిగుంట:** మండలంలోని కొత్తపాళెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 99లో ఉన్న 5.33 ఎకరాల ప్రభుత్వ భూమిని తమదే అంటూ కొందరు అధికార పార్టీ నేతలు సుమారు నెల రోజులుగా నానా యాగీ చేస్తున్నారు. రేణిగుంట విమానాశ్రయానికి సమీపంలో సుమారు రూ.60 కోట్ల విలువైన ఈ ప్రభుత్వ భూమిని ఆదివారం ఉదయం 9 జేసీబీలు, 20 ట్రాక్టర్లతో చదును చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై సమాచారం అందుకుని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఇది ప్రభుత్వ భూమి అని మరోసారి ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కనిపించని హెచ్చరిక బోర్డు**

ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు నెల నుంచి ఈ భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ ప్రధాన నేతల అండదండలతోనే కబ్జాదారులు చెలరేగిపోతున్నట్లు స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూమికి కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**రంగంలోకి బినామీ**

కబ్జా యత్నం వికటించే సరికి టీడీపీ నేతలు వెంటనే బినామీని రంగ ప్రవేశం చేయించారు. కొత్తపాళెం దళితవాడకు చెందిన మరియమ్మతో సదరు 5.33 ఎకరాలకు లీజు పట్టా ఉందని అధికారులకు చెప్పించారు. గతంలో ఇది ప్రభుత్వ భూమి అని రెవెన్యూ సిబ్బంది చెప్పడంతో హైకోర్టును ఆశ్రయించామని, తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయని హడావుడి చేశారు. అయితే మరియమ్మ వెనుక టీడీపీ నేతలు ఉన్నారని, రూ.కోట్ల విలువైన భూమిని కాసేందుకు దళితురాలిని ముందుపెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆమెకు ఎంతో కొంత ముట్టజెపుతామని ఆశపెట్టి బినామీగా మార్చుకున్నారని స్పష్టం చేస్తున్నారు.

**మీడియాపై దౌర్జన్యం**

ప్రభుత్వ భూమి కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకుని, జేసీబీలు, ట్రాక్టర్లను పంపించే దృశ్యాలను చిత్రీకరిస్తున్న విలేకరులపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. మా భూమిలోకి వచ్చి ఫొటోలు ఎలా తీస్తారంటూ వాగ్వాదానికి దిగారు. ఇది ప్రభుత్వ భూమి అని అధికారులు చెబుతున్నారు కదా అని ప్రశ్నించిన వారిపై దాడికి సైతం యత్నించారు.

**దేవాలయం పేరుతో చెరువు స్వాహా**

తూకివాకం పంచాయతీలోని ఎర్రమరెడ్డిపాళెం చెరువును సైతం స్వాహా చేసేందుకు టీడీపీ నేతలు ప్రణాళిక రచించారు. ఇప్పటికే చెరువులో కొంత భాగం చదును చేయించేశారు. ఆ స్థలంలో దేవాలయం నిర్మిస్తామని స్థానికులను మభ్య పెట్టేందుకు యత్నించారు. అయితే రైతు సంఘం నేత హేమలత ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు ఈ ఆక్రమణకు అడ్డుపడ్డారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ జయకృష్ణ పర్యవేక్షణలో చెరువులో టీడీపీ నేతలు వేయించిన ఫెన్సింగ్‌ను తొలగించారు. మరెవరు ఆ స్థలంలోకి ప్రవేశించకుండా ట్రెంచ్ తవ్వించారు. అయితే ఆక్రమణకు గురైన ప్రాంతం తిరుపతి రూరల్ మండలానికి చెందినగా రెవెన్యూ అధికారులు గుర్తించడంతో ఈ మేరకు సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందించారు. ఈ స్థలంలో రెండు మండలాల సర్వేయర్లతో సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

**టీడీపీ నేతల అండతోనే..**



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిగా చెరువుల ఆక్రమణ పెరిగిపోయింది. టీడీపీ నేతల అండతోనే కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఎర్రమరెడ్డి పాళెం చెరువులో దేవాలయం, కల్యాణమండపం నిర్మిస్తున్నామంటూ టీడీపీ లక్ష్మీపురం ఇన్‌చార్జి రమేష్, సీఆర్‌ఎస్‌లో పనిచేసే అంకయ్య కబ్జాకు యత్నించారు. స్థానికుల రైతులతో కలిసి ఆక్రమణను అడ్డుకున్నాం. – హేమలత, ప్రధాన కార్యదర్శి, రైతు సంఘం

**కబ్జాలపై కఠిన చర్యలు**



ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొత్తపాళెంలోని 5.33 ఎకరాలు ప్రభుత్వ భూమి, ఇది కలెక్టర్ సైతం నిర్ధారించారు. ఇందులోకి ఎవరు ప్రవేశించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అలాగే చెరువుల ఆక్రమణలను సహించే ప్రసక్తే లేదు.– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, రేణిగుంట

# యువతకు తీరని ద్రోహం

- ఉద్యోగాలు లేవు.. నిరుద్యోగ భృతి లేదు
- కూటమి ప్రభుత్వంపై భూమన ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం:** అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.. లేకుంటే నిరుద్యోగ భృతి అందిస్తామంటూ మాయమాటలు చెప్పి యువతకు మొండిచెయ్యి చూపించి చంద్రబాబు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనతో యువతకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. కనీసం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సైతం విద్యార్థులకు అందించలేదని విమర్శించారు. దీంతో కళాశాలల యాజమాన్యాల వేధింపులతో పిల్లలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో సైతం అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మినహా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బలహీనపరచి అణగదొక్కడమే లక్ష్యంగా పెట్టుకుని కీలక నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కక్ష సాధింపులపై పెడుతున్న శ్రద్ధలో పావు వంతు కూడా యువత, ప్రజాసంక్షేమంపై చూపడం లేదని మండిపడ్డారు.

**ఇది ఉద్యమ సమయం**

కూటమి ప్రభు త్వం చేసిన మోసం, ద్రోహంపై యువత ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని భూమన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువత పోరుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు, ప్రజలు తరలి రావాలని కోరారు. పార్టీ విద్యార్థి, యువజన విభాగాల జిల్లా అధ్యక్షులు అందరితో సమన్వయం చేసుకుంటూ తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్‌ల వద్ద శాంతియుత నిరసన చేపట్టాలని సూచించారు. అనంతరం యువతకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును కోరుతూ కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. భారీ సంఖ్యలో యువత తరలిరావాలని పిలుపునిచ్చా రు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవి చంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న జేవీవీ ప్రధాన కార్యదర్శి రామారావు

**తిరుపతి కల్చరల్ :** సమాజంలో మూఢ నమ్మకాలను నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు తెలిపారు. ఆదివారం తిరుపతి పెద్దకాపు వీధిలోని యూటీఎఫ్ భవన్‌లో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామారావు మాట్లాడుతూ సమాజంలోని వివిధ రుగ్మతులు, మూఢ నమ్మకాలను పోగొట్టేందుకు కళాజాతాలు, మ్యాజిక్ షోలు ,చెకుముకి పోటీ పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, రచయిత విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ చరిత్ర గమనంలో సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్‌లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో జన విజ్ఞాన వేదిక ప్రాధాన్యత, ఆవశ్యకతను తెలిపారు. అనంతరం విఠపు బాలసుబ్రమణ్యం రచించిన 'ప్రజా సైన్స్ ఉద్యమం', గేయానంద్ రచించిన 'చరిత్ర గమనంలో సైన్స్' పుస్తకాలను జేవీవీ నేతలు టెంకాయల దామోదరం ,రామారావు, సురేష్, నాగేశ్వరరావు, యుగంధర్ ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డెప్ప పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చెవిరెడ్డి కోసం ప్రత్యేక పూజలు



మూలస్థాన ఎల్లమ్మకు మొక్కుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి త్వరగా బెయిల్ మంజూరు కావాలంటూ వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఈ మేరకు ఆదివారం చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగాలమ్మ విగ్రహాలకు పసుపు–కుంకులతో అభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెవిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. కూటమి నేతలు చేస్తున్న దారుణాలు, కబ్జాలు, అవినీతిని చెవిరెడ్డి ఎండగడుతున్నారనే అక్రమ కేసులో ఇరికించారని మండిపడ్డారు. ఏడాదిగా చంద్రగిరిలో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా దోచేయడంపై నిరంతరం చెవిరెడ్డి కుటుంబం ప్రజల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. తమ నాయకుడు చెవిరెడ్డి ఇటీవల అనారోగ్యం పాలై తీవ్ర అస్వస్థతకు లోనయ్యారని, ఆయన ఆరోగ్యం కుదుట పడి, త్వరగా బెయిల్ మంజూరు రావాలని ఆకాంక్షించారు.

### పోరు గాలి.. వేట ఖాళీ!



సముద్రంపై ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు

వాకాడు : వాతావరణంలో మార్పు కారణంగా సముద్రంపై పోరు గాలి వీస్తుంది. దీంతో వారం రోజులుగా మత్స్యకారులకు వేట సజావుగా సాగటం లేదు. సాధారణంగా వేట విరామం తర్వాత సముద్రంలో మత్స్య సంపద సమృద్ధిగా దొరుకుతుంది. ప్రస్తుతం మత్స్య సంపద పుష్కలంగా ఉన్నప్పటికీ పోరుగాలి, అలలు ఉధృతి కారణంగా వేట సాగించలేని దుస్థితి తలెత్తింది. వేట లేని కారణంగా వాకాడు మండలంలోని తూపిలిపాళెం, పామంజి, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, పంబలి, ఓడపాళెం, మొనపాళెం, వైట్‌కుప్పం, పూడికుప్పం, చినతోట, నవాబుపేట, పూడిరాయిదొరువు గ్రామాల మత్స్యకారులకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. సముద్రంలో చేపలు పుష్కలంగా ఉన్నప్పటికీ బోట్లను ఖాళీగా ఒడ్డున ఉంచాల్సిన దుస్థితి దాపురించింది.

# పవర్ ఉత్తుత్తిదే!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పవర్ లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. కానీ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడుస్తున్నా నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చేనేత రంగానికి ప్రభుత్వం చేయూత ఇవ్వకపోవడంతో వెలవెలబోతోంది. పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక పవర్‌లూమ్ కార్మికులు రోడ్డున పడుతున్నారు. 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేసి కాలయాపన చేస్తుండడంపై నేతన్నలు మండి పడుతున్నారు.

- పవర్ లూమ్‌కు అమలు కాని ఉచిత విద్యుత్ జీఓ
- 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు
- 10,534 పవర్ లూమ్ యూనిట్లకు 500 యూనిట్లు
- వీటికి ఏడాదికయ్యే ఖర్చు కేవలం రూ.125 కోట్లు
- అమలుకు కూటమి ప్రభుత్వం వెనుకంజ

పుత్తూరు : కూటమి ప్రభుత్వంలో పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు విరజిమ్ముతాయనుకుంటే గాఢాంధకారం అలుముకొంది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతిపెద్ద ఉపాధి రంగం. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ రంగం ప్రస్తుతం దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. లయబద్ధంగా వినబడే పవర్ లూమ్స్ ధ్వని ప్రస్తుతం వినిపించడం లేదు. దాదాపు అన్ని పవర్ లూమ్ కేంద్రాలు మూతపడే పరిస్థితిలోకి వచ్చాయి. గత మార్చి 26వ తేదీన కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీఓ నం.44 మూడు నెలలు కావస్తున్నా అమలు కాకపోవడంతో నేతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలతో నేతన్న జీవితాలు అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### గత ప్రభుత్వంలో ఆదుకున్న 'నేతన్ననేస్తం'

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతేకాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడి హోదాలో నారా చంద్రబాబు నాయుడు పుత్తూరులో పర్యటించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. దీనిని గుడ్డిగా నమ్మిన నేత కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన బాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో పాటు వివిధ సుంకాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచి నేత కార్మికుల నడ్డి విరిచారు.

### జీఓ అమలులో నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 26వ తేదీన జీఓ 44ను విడుదల చేసింది. ఇందులోనూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల వాస్తవ సంఖ్య, పవర్‌లూమ్ యూనిట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపిస్తూ జీఓ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నూలు, పట్టు చేనేత కుటుంబాలు 2,79,000 మంది ఉండగా కేవలం 93 వేల మందిగా చూపించారు. అలాగే మర మగ్గాలు 81 వేలు ఉండగా కేవలం 10 వేలు ఉన్నట్టుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీఓలో స్పష్టం చేశారు. ఇందుకు ఏడాదికి సుమారు రూ.125 కోట్ల ఆర్థిక భారం పడనున్నదని పేర్కొన్నారు. జీఓ అమలుకు డిస్కమ్ సంస్థలు ఇంధన శాఖకు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీఓ విడుదలై 3 నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆ జీఓపై నేతన్నలకు అనుమానాలు నెలకొంటున్నాయి. ప్రతినెలా యథావిధిగా పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను అందుకొంటున్న నేతన్నలు తలలు పట్టుకొంటున్నారు. జీఓ అమలుకు వైఎస్సార్‌సీపీ సారథ్యంలో ఆందోళనలకు నేతన్నలు సిద్ధమవుతున్నారు.




#### జీఓ నం.44 అమలు చేయాలి



తమిళనాడులో 15 ఏళ్లుగా పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ జీఓ విడుదల చేసి మూడు నెలలు అయినా అమలు చేయకపోవడం దారుణం. పైగా ఎఫ్‌పీపీసీఏ అనే కొత్త రకం చార్జీలు వేసి నేతన్నల నడ్డివిరుస్తున్నారు.

– సి.కార్తీక్, బీఎంఎస్ నాయకుడు, పుత్తూరు

#### నేతన్నకు ఆర్థిక సాయం అందించాలి



గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఈ పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందడంతో నేతన్న కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఉచిత విద్యుత్‌తో పాటు నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలి.

– బి.వి.వేందాం, పవర్‌లూమ్ కార్మికురాలు, పుత్తూరు

### నేతన్నల డిమాండ్లు ఇవీ

- జీఓ నంబర్ 44ను వెంటనే అమలు చేయాలి.
- మొత్తం రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి.
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి.
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని వర్తింపజేయాలి.
- నూలు, సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి.
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి.
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి.
- బీమా సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి.

#### మూడు నెలలుగా కాలయాపన



ఒక్క రోజు యోగా చేయడానికి రూ.300 కోట్లు ఖర్చు చేశారు. నేతన్నల కోసం మూడు నెలల కిందట విడుదల చేసిన జీఓ నంబర్ 44 పరిస్థితి ఏమిటి? ఈ జీఓ కింద మీరు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేతన్నల కోసం ఏడాదికి ప్రకటించిన మొత్తం కేవలం రూ.125 కోట్లు. దీనిని విడుదల చేయడానికి ఎందుకింత ఆలస్యం. ఇకనైనా జీఓ అమలు చేసి నేతన్నలను ఆదుకోవాలి.

– డి.ఎ.వేలు, నారాయణవనం

#### సర్వేలతో తగ్గించే కుట్ర



రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కుటుంబాలు 2,79,000 వేల మంది ఉండగా కేవలం 93 వేల మందిగాను, అలాగే మరమగ్గాల యూనిట్లు 81 వేలు ఉండగా, కేవలం 10,534 ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం మళ్లీ సర్వేలు నిర్వహిస్తూ ప్రకటించిన సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అత్యంత దారుణం. జీఓ 44 విడుదలై 3 నెలలు దాటినా అమలు కాకపోవడానికి ఈ సర్వేలే ప్రధాన కారణం.– ఆకుల వాసు,అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్, తిరుపతి

# చంద్రగిరిలో రాక్షస పాలన

- మట్టి, ఇసుక మాఫియా రెచ్చిపోతోంది
- ఎమ్మెల్యే నానిపై మోహిత్ రెడ్డి ఆగ్రహం



బాధితుడితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో రాక్షస పాలన సాగుతోంది.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టులు, ప్రశ్నించే వారిని అణగదొక్కేందుకు యత్నిస్తున్నారు. ముసుగులు వేసుకుని వచ్చి పట్టపగలు కొట్టడం ఏంటి..? బంది పోట్లను దిగుమతి చేసుకున్నారా..? అనిపిస్తోంది.. గ్రామాల్లో మట్టి , ఇసుక మాఫియా రెచ్చిపోతోంది.. ఎవరు అడిగినా వారిపై దాడులకు దిగుతున్నారు.. పోలీసులు ఫిర్యాదులు కూడా తీసుకోవడం లేదు.. ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా.. అర్థం కావడం లేదు.. ఎమ్మెల్యే పులివర్తి నాని ప్లాన్ చేసి చేయిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది.. గతంలో మాపై రకరకాల పోస్టులు పెట్టినా ఎవరినీ వేధించలేదు.. తప్పులు ఉంటే సరిదిద్దుకున్నామే తప్ప ఎవరిపైనా కేసులు పెట్టలేదు.. పరిస్థితి ఇలాగే కొనసాగితే రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుంది" అంటూ వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బాధితుడికి పరామర్శ**

రామచంద్రాపురం మండలం కుప్పం బాదూరుకు చెందిన సెంథిల్‌కుమార్‌పై టీడీపీకి చెందిన కొందరు మట్టి రవాణాదారులు నడిరోడ్డుపై దాడి చేయడంపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం కుప్పం బాదూరులోని సెంథిల్ కుమార్ ఇంటికి వెళ్లి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా ప్రధాన దినపత్రికల్లో మట్టి , ఇసుక మాఫియాలపై ప్రచురించిన క్లిప్పింగ్‌లను సోషల్ మీడియాలో సెంథిల్ కుమార్ పోస్టు చేశారన్నారు. ఇది సహించలేకే మట్టి మాఫియా హత్యాయత్నానికి తెగబడిందని ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పట్టపగలు అందరూ చూస్తుండగా దాడి జరుగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం దారుణమన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయకుంటే ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని, అక్కడ కూడా న్యాయం జరగకుంటే న్యాయస్థానంలో ప్రైవేట్ కేసు వేస్తామని స్పష్టం చేశారు.

# ఎంటీఎస్ టీచర్లపై కుట్ర

- 3.15 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ (మినిమం టైం స్కేల్) టీచర్ల బదిలీల ప్రక్రియలో ఖాళీలన్నీ చూపించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం నిర్వహించాల్సిన ఈ ప్రక్రియ మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభించారు. ఆ రెండు డీఎస్సీల టీచర్లకు టీడీపీ ప్రభుత్వం పాలనలో అన్యాయం జరిగితే గత వైఎస్సార్‌సీపీ సర్కారు మేలు జరిగేలా చేసింది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ టీచర్‌గా పనిచేయాలని కలలు కన్న ఆ టీచర్ల కోరికను వైఎస్సార్‌సీపీ సర్కారు నెరవేర్చింది. అయితే ఇంత వరకు బాగానే ఉండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లపై కక్ష సాధింపునకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

**ఖాళీలు బ్లాక్ చేసి..**

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్ల బదిలీల్లో కుట్రకు పాల్పడేందుకు ప్రయత్నించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఖాళీలన్నీ చూపించకుండా తక్కువ ఖాళీలను చూపించి ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నించారు. అయితే ఎంటీఎస్ టీచర్లు తమకు అన్యాయం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని విద్యాశాఖ అధికారులకు హెచ్చరించారు. దీంతో ఆదివారం ఉదయం నిర్వహించాల్సిన బదిలీల కౌన్సెలింగ్ మధ్యాహ్నం 3.15 గంటల వరకు ప్రారంభం కాని దుస్థితి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ మండలాల నుంచి హాజరైన ఎంటీఎస్ టీచర్లు మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు.



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

### మొదటి విడత కౌన్సెలింగ్

ఎంటీఎస్ టీచర్ల డిమాండ్‌లను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారులు సమస్యలను ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న ఖాళీలన్నింటినీ ప్రదర్శించి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించిన తర్వాత మధ్యాహ్నం 3.15 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు. వైఎస్సార్ 98 డీఎస్సీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు స్వామి కణ్ణన్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు ఎంటీఎస్ టీచర్ల సమస్యలను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు 180 పోస్టులకు మొదటి విడతగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు 369 పోస్టులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 1664 పోస్టులను ఎంటీఎస్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో చూపించారు. ఇందులో 549 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం జిల్లాలో 1115 టీచర్ల పోస్టులు మిగులు ఉంటాయి. ఆ పోస్టులను ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించే అభ్యర్థులతో భర్తీ చేయనున్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

# మృత్యువులోనూ వీడని బంధం

ఆ దంపతులు అన్యోన్యంగా ఉన్నారు. వివాహమైన ఎనిమిదేళ్లకు కవల పిల్లలు జన్మించారు. భర్త ఆర్మీలో ఉద్యోగ విరమణ పొందాడు. ప్రస్తుతం ప్రైవేటు గన్‌మెన్‌గా చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో తమ కలల రూపాలైన కవలలను ఉన్నతంగా చదివించాలని ఆరాట పడ్డారు. ఈ క్రమంలో సొంతూరి నుంచి చిత్తూరుకు మకాం మార్చారు. ఆ దంపతులు పిల్లల భవిష్యత్తుపై ఎన్నో కలలుకన్నారు. కానీ ఆ కలలను దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం చిదిమేసింది. దంపతులిద్దరినీ మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో కుమారుడు, కుమార్తె గాయపడి స్పృహ కోల్పోయారు. గాయపడిన ఆ కుటుంబ ఆశాదీపాలను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లిదండ్రులకు ఏం జరిగింది.. ఎలా ఉన్నారో..ఎక్కడ ఉన్నారో ఆ పసి హృదయాలకు పాపం తెలియదు.



ప్రమాదంలో దగ్ధమవుతున్నకారు, (ఇన్‌సెట్) మృతుడు సిద్ధయ్య

- దైవదర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి
- దంపతుల మృతితో విషాదం
- కుప్పిగానిపల్లెలో విషాదఛాయలు



కుటుంబ సభ్యులతో సిద్ధయ్య (ఫైల్)

గుడిపాల : గుడిపాల మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సిద్ధయ్య(47), అతడి భార్య జ్యోతిలక్ష్మి (43) మృతి చెందగా, కొడుకు, కుమార్తె గాయపడ్డారు. దీంతో కుప్పిగానిపల్లె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల దైవదర్శనానికి కుటుంబంతో కలిసి వెళ్లి వస్తుండగా పనపాకం సమీపంలోని గడ్డకిందపల్లె వద్ద ఆవును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే దంపతులు మృతి చెందారు. దంపతుల ఇద్దరిదీ కుప్పిగానిపల్లె గ్రామమే. వీరికి ఇద్దరు కవల పిల్లలు. పిల్లల చదువు కోసం చిత్తూరులో నివాసం ఉంటున్నారు. గిరి(13), గాయత్రి(13) బివిరెడ్డి ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు.

**తండ్రి అడుగుజాడలోనే ఆర్మీలో చేరి..**

కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన నాగరత్నం, సరస్వతీలకు 1978లో సిద్ధయ్య జన్మించాడు. నాగరత్నం ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయ్యి టీటీడీలో పనిచేశాడు. నాగరత్నం చొరవతో కుమారుడు సిద్ధయ్య 1998లో ఆర్మీలో ఉద్యోగం చేస్తూ కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన నరసింహులు, జగద కుమార్తె జ్యోతి లక్ష్మిని 2002లో వివాహం చేసుకున్నాడు. వీరికి సుమారు ఎనిమిదేళ్ల వరకు పిల్లలు కలగలేదు. అనంతరం ఇద్దరు కవల పిల్లలు జన్మించారు.





గాయపడిన పిల్లలు గాయత్రి, గిరి

**పిల్లలను ఉన్నతంగా చదివించాలని..**

పిల్లలు జన్మించిన అయిదు సంవత్సరాలకు వారి చదువు కోసం చిత్తూరులో కాపురం పెట్టారు. సిద్ధయ్య 2020 సంవత్సరంలో ఆర్మీ నుంచి ఉద్యోగ విరమణ పొందారు.ఈక్రమంలో చిత్తూరులోని ప్రైవేట్ పాఠశాలలో చదివించుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

### పుట్టిన రోజే మృత్యుఒడిలోకి

సిద్ధయ్య పుట్టిన రోజుకి ఎప్పుడూ తిరుమల దైవ దర్శనానికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుమలలో స్వామిని దర్శించుకొని పిల్లలు, భార్యతో కలిసి కారులో తిరిగి వస్తున్న నేపథ్యంలో వారిని మృత్యువు వెంటాడడంతో దంపతులు మృత్యుఒడికి చేరుకోగా పిల్లలు తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ సైనికుడిగా ఉన్న సిద్ధయ్య ప్రస్తుతం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రైవేట్ గన్‌మెన్‌గా ఉంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మోహిత్‌రెడ్డి తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

### టీటీడీకి ఏసీ బస్సు విరాళం



బస్సును అప్పగిస్తున్న అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధి

తిరుమల:ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ,అశోక్ లేలాండ్ తిరుమల–తిరుపతి దేవస్థానానికి ఒక 41–సీటర్ ఏసీ బస్సును ఆదివారం విరాళంగా అందజేసింది. సుమారు రూ.35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎంఅండ్‌హెచ్‌సీవీ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు అందజేశారు. సాధారణంగా ప్రతి ఏటా ఈ కంపెనీ యాజమాన్యం టీటీడీకి ఒక వాహనాన్ని విరాళంగా ఇవ్వడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిపో డీఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

రేణిగుంట: భర్తతో గొడవపడి మనస్థాపంతో ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగు చూసింది. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జీపాల్యం హరిజనవాడలో భాస్కర్ తేజోవతి దంపతులు కాపురం ఉంటున్నారు. ఆదివారం ఉదయం భర్తతో జరిగిన చిన్నపాటి గొడవ వల్ల మనస్థాపానికి గురైన తేజోవతి (37) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. గాజులమండ్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.